ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
గురువారం 26 సెప్టెంబరు 2024



ఢిల్లీలో ఎక్సలెన్స్ ఆఫ్ సర్టిఫికెట్‌ను స్వీకరిస్తున్న బల్దియా అధికారులు



అక్రమాలకు గురవుతున్న హనుమకొండలోని పులిగుట్ట

- మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు కీలక నేతలు, తాజా, మాజీ కార్పొరేటర్ల హస్తం
- హంటర్‌రోడ్డులోని సర్వే నెంబరు 964, 966లో 49ఎకరాల ప్రభుత్వ భూమి
- 2015లో టైగర్స్‌హిల్స్‌పై 15ఎకరాల్లో సైన్స్ సెంటర్ ఏర్పాటు
- ఆ కేంద్రంతో పాటు పదెకరాలకుపైగా సర్కారు స్థలాల అన్యాక్రాంతం
- పక్క సర్వే నెంబరుతో అక్రమ రిజిస్ట్రేషన్లు.. దర్జాగా అక్రమ నిర్మాణాలు
- పులిగుట్ట పరిసర ప్రాంతాల భూములపై సర్వే చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..


సైన్స్ సెంటర్ భూములు స్వాహా!

కబ్జాకోరల్లో 200కోట్ల విలువైన పదెకరాలు

మహానగరంలో భూ మాయగాళ్లు చెలరేగిపోతున్నారు. వరంగల్ ట్రై సిటీస్‌లో సర్కారు జాగా ఖాళీగా కనిపిస్తే చాలు ఫెన్సింగ్ వేసి చుట్టేస్తున్నారు. పొరుగు భూముల సర్వే నెంబర్లతో రూ.కోట్ల విలువైన సర్కారు భూములకు ఎసరు పెడుతున్నారు. అక్రమ నిర్మాణాలతో పర్మినెంట్‌గా సెటిల్ అయిపోతున్నారు. కొన్నాళ్లుగా హనుమకొండ హంటర్ రోడ్డులోని పులిగుట్ట (టైగర్ హిల్స్)పై ఏర్పాటు చేసిన సైన్స్ సెంటర్‌తో పాటు సుమారు 10ఎకరాల ప్రభుత్వ భూముల్లో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు, తాజా, మాజీ కార్పొరేటర్లు, అధికార పార్టీ నేతలతో పాటు చోటామోటా నేతలు గుట్టలను తవ్వేస్తూ.. ఖాళీస్థలాల్లో దర్జాగా తిష్టవేస్తున్నారు. అడుగు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైతేనే ఆగమాగమయ్యే అధికారులు పులిగుట్ట ప్రాంతంలో సుమారు రూ.200కోట్లకు పైగా విలువైన భూములు కబ్జా అవుతుంటే చోద్యం చూస్తున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉమ్మడి ఓరుగల్లు విద్యార్థులు మరింత అభ్యున్నతి సాధించాలన్న లక్ష్యంతో 2015లో హంటర్‌రోడ్డులోని పులిగుట్ట (టైగర్ హిల్స్)పై 15ఎకరాల్లో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(టీజీసీఎస్‌టీ)ని ఏర్పాటు చేశారు. నాడు విద్యాశాఖ మంత్రిగా ఉన్న కడియం శ్రీహరి ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ రీజనల్ సైన్స్ సెంటర్‌లో 69సైన్స్ ఎగ్జిబిషన్స్‌తో పాటు ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఎన్విరాన్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందు కోసం గతంలోనే ప్రభుత్వం రూ.6కోట్లు వెచ్చించింది. తాజాగా మరో రూ.4కోట్లతో సైన్స్ సెంటర్ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పనులు ప్రారంభించారు. నగరం నడిబొడ్డులో ఉండ టంతో పాటు వేలాది మంది విద్యార్థులకు ఉపయోగ పడే టైగర్స్‌హిల్స్ గుట్టల భూములపై కబ్జాకోరుల కన్ను పడింది. వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను కొల్లకొడుతున్నారు.



రికార్డుల్లో సర్వే నెం.964, 966లో ప్రభుత్వ భూమిగా నమోదు

రూ.200కోట్ల విలువైన భూములు స్వాహా?

వరంగల్ మహానగరం రోజురోజుకు విస్తరిస్తోంది. దీంతో భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్రమార్కులు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములపై కన్నేస్తూ దర్జాగా కబ్జా చేస్తున్నారు. హనుమకొండ పట్టణంలోని హంటర్‌రోడ్డులో వన విజ్ఞాన కేంద్రం, రీజనల్ సైన్స్ సెంటర్‌తో పద్మాక్షి గుడి, సిద్ధేశ్వరస్వామి ఆలయం, జూ పార్కులు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతం కమర్షియల్‌గా అభివృద్ధి చెం దుతోంది. ఈ ఏరియాలో హనుమకొండ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 964లో 44.37 ఎకరాలు, సర్వే నెంబరు 966లో 4.03ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రెండు సర్వే నెంబర్లలో మొత్తం 49ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. వీటిలో రీజనల్ సైన్స్ సెంటర్ కోసం 2015లో ప్రభుత్వం 14.20ఎకరాల భూమిని కేటాయించింది. సర్వే నెంబర్లు 964, 966లో మొత్తం 49ఎకరాల్లో సైన్స్ సెంటర్‌కు 14.20 ఎకరాల భూమిని కేటాయించగా, మిగిలిన భూమిలో 127 అక్రమ కట్టడాలు నిర్మించి నట్టు గుర్తించారు. వీటికి కార్పొరేషన్ అధికారులు ఇంటి నెంబర్లు కేటాయించటంతో పాటు ఇంటి పన్ను, నల్లాపన్నులు కూడా వసూళ్లు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. అలాగే మిగిలిన భూ మికి ఎలాంటి హద్దులు లేకుండా అధికారులు వది లేశారు. ఇందులో శిల్పారామం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విలేజ్ ఏర్పాటు చేయాలని గతంలో తహసీల్దార్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే అవి అమలుకు నోచుకోలేదు. కాలక్రమేణా హంటర్ రోడ్డు అభివృద్ధి చెందుతుండటంతో కబ్జారా యుళ్ల కళ్లు టైగర్ హిల్స్‌పై పడింది. గత ప్రభుత్వ హ యంలో కీలక నేతలు ఆదేశాల తోనే వారి అను చరులు హంటర్‌రోడ్డులో ఉన్న ఖాళీగా కనిపిస్తున్న గుట్టతో పాటు చెట్లను, పొదలను తన ఎక్స్‌కవేటర్ యంత్రాలతో ఓ నేత చదును చేసి దర్జాగా కబ్జా చేశారనే ప్రచారం జరుగుతోంది. పక్కనే ఇతర స ర్వే నెంబర్లలో భూములు

మిగతా 6వ పేజీలో..



సర్వే నెం.964లో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

భళా బల్దియా!



- నైబర్ హుడ్ పోటీల్లో స్థానం
- దేశంలో టాప్-5గా నగరంగా గుర్తింపు
- నాడు స్మార్ట్ సిటీ అవార్డు.. నేడు ఎన్ఎన్‌సీ సర్టిఫికెట్
- అధికారులను అభినందించిన మేయర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ సిగలో మరో మణిహారం చేరింది. గతంలో స్మార్ట్ సిటీ అవార్డును సొంతం చేసుకోగా, ఇప్పుడు నైబర్ హుడ్ చాలెంజ్ పోటీలలో ఎక్సలెన్స్ సర్టిఫికెట్ లభించింది. వివరాల్లోకి వెళితే.. కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహ మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ) ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో స్మార్ట్‌సిటీ నగరాలకు సంబంధించిన సమావేశం నిర్వహించారు. మూడేళ్లుగా నిర్వహిస్తున్న నర్సరింగ్ నైబర్‌హుడ్ చాలెంజ్ (ఎన్ఎన్‌సీ) పోటీలలో దేశంలోని పది నగరాలకు గుర్తింపు లభించింది. దీనిలో గ్రేటర్ వరంగల్ టాప్-5లో నిలవడం గమనార్హం. ఈమేరకు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును అందించినట్టు బల్దియా స్మార్ట్ సిటీ విభాగం ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర తెలిపారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ మిషన్ డైరెక్టర్ రాహుల్ కపూర్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను ప్రవీణ్‌చంద్రతోపాటు ఏఈ కార్తీక్‌రెడ్డి అందుకున్నట్టు పేర్కొన్నారు. ఎన్ఎన్‌సీ పోటీలలో బెంగుళూరు, ఇండోర్, జబల్‌పూర్, కొచ్చి, నగరాలతోపాటు వరంగల్‌కు స్థానం దక్కడం సంతోషంగా ఉందని మేయర్ గుండు సుధారాణి వ్యక్తపరిచారు. అవార్డు రావడానికి కృషిచేసిన స్మార్ట్‌సిటీ, ఇంజనీరింగ్ అధికారులను ఆమె అభినందించారు. మేయర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కేంద్రం వంద స్మార్ట్ సిటీ నగరాలను ఎంపిక చేశారన్నారు. ఫేజ్-1లో భాగంగా ఎన్ఎన్‌సీ చాలెంజ్ పేరుతో వరంగల్ నగరంలో ఎంహెచ్‌నగర్‌లో 56 గంటలలో చిట్టి పార్క్‌ను ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించామన్నారు. వరంగల్ క్రిష్టియన్‌కాలనీలో నైబర్‌హుడ్ పార్క్, కరీమాబాద్‌లో గుండు బావి, శ్రీనగర్ కాలనీలో మెన్‌సోరి పార్కు, ఎన్‌పీ స్కూల్‌లో సైన్స్ పార్క్, అంబేద్కర్ కూడలి వద్ద బుద్ధ ప్లాజాలను నిర్దేశిత సమయంలో ఏర్పాటు చేసి డాక్యుమెంటేషన్ కమిటీకి పంపించినట్లు పేర్కొన్నారు.

కాళోజీ కళాక్షేత్రం ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలి

బాలసముద్రం, సెప్టెంబరు 25: హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులకు సూచించారు. బుధవారం కళాక్షేత్రాన్ని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. కళాక్షేత్రంలో నిర్మాణం పూర్తయిన వాటర్ ఫౌంటెన్, లాన్‌ఫోటో, ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియానికి సంబంధించిన ప్రొజెక్టర్ స్క్రీన్, సౌండ్‌సిస్టమ్, విద్యుద్దీపాలు, వేదిక, కళాకారుల మేకప్ రూమ్, ర్యాంప్ లైట్స్ తదితర పనులను పరిశీలించారు. ఆపై అధికారులకు, సంబంధిత నిర్మాణ సంస్థ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ప్రారంభోత్సవ రోజున జరిగే కార్యక్రమాలు, ఏర్పాట్లను కుడా పీవో అజిత్‌రెడ్డి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్‌లను అడిగి తెలుసుకున్నారు. ప్రారంభోత్సవం రోజు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో ఏర్పాట్ల ను చూసుకోవాలని అధికారులకు సూచించారు.

ప్లాస్టిక్‌ను తరిమికొట్టాలి

- గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి..
- స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో కలెక్టర్



కల్లెడలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద



పర్వతగిరి, సెప్టెంబరు 25 : ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని కలెక్టర్ సత్యశారద కోరారు. బుధవారంలో కల్లెడలో 'స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ మ్యాప్‌ను, తడి, పొడి చెత్తను వేరు చేసే విధానాన్ని ముగ్గుల రూపంలో ప్రదర్శించడంతో వాటిని ఆసక్తిగా తిలకించారు. ఏక్ పేడ్ మా కే నామ్ పేరిట గ్రామ పంచా యతీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామాన్ని ప్రతీరోజూ పరిశుభ్రంగా ఉంచుతున్న స్వచ్ఛ కార్మికులను సన్మానించి వారికి రక్షణ కిట్లను పంపిణీ చేశారు. స్వచ్ఛతపై పాఠశాలలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందించారు.

కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగించడంతో అనేక రోగాల బారిన పడుతున్నామని, వాటిని తరిమి కొడితేనే భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందన్నారు. పరిసరాలను పరిశుభ్రం కోసం ప్రతీ శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డేకు తోడు ఇకనుంచి శ్రమదానం చేయాలని గ్రామస్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ కౌసల్యాదేవి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీసీవో, మండల స్పెషల్ ఆఫీసర్ నీరజ, సెర్ప్ ఏపీడీ రేణుకాదేవి, ఎంపీడీవో శంకర్‌నాయక్, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీవో శ్రీనివాసులు, ఏపీవో సుశీల్‌కుమార్, ఏపీఎం కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై కఠినంగా వ్యవహరించాలి

వరంగల్ కలెక్టరేట్ : జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సరిహద్దులోని ఫారెస్టు భూముల్లో గంజాయి సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు, ఎక్సైజ్, ఫారెస్టు అధికారులను ఆదేశించారు. కాలేజీ మారుమూల ప్రాంతాల్లో ఉన్న డిగ్రీ, ఇంటర్ కాలేజీ విద్యార్థుల ప్రవర్తనలో మార్పులపై, అనుమానాస్పద ప్రాంతాల్లో సంచరించే వ్యక్తులను గమనిస్తే టోల్‌ఫ్రీ నెంబరు87126 61111కు సమాచారం అందించాలన్నారు. కిరాణ షాపుల వేదికగా గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించే వారితోపాటు రైల్వే, బస్టాండ్ ప్రాంతాల్లో పటిష్ఠ నిఘా పెట్టి పెట్రోలింగ్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్, మట్టెవాడ సీఐ గోపి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మంజుల పాల్గొన్నారు.



నల్లబెల్లి మండలంలోని రంగాయ చెరువు

మౌన మీనా!

- ప్రారంభం కాని చేపపిల్లల పంపిణీ
- అదును దాటుతోందని మత్స్యకారులు ఆందోళన
- జూన్ నుంచే పంపిణీ ఆరంభించిన గత ప్రభుత్వం
- సెప్టెంబరు మూడో వారమైనా స్పందించని రాష్ట్ర సర్కారు
- చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలంటున్న సొసైటీలు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 24: జిల్లాలో ఇంకా చేపపిల్లల పంపిణీ జరగకపోవడంతో మత్స్య కారులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో జూలై రెండో వారం నుంచే చేప పిల్లల పంపిణీ చేపట్టింది. ఈసారి సెప్టెంబరు మూడో వారం వచ్చినా ప్రభుత్వం ఇంకా తాత్సారం చేయడంపై మండిపడుతున్నారు. జూన్, జూలై, చివరకు ఆగస్టులో వదిలినా ఫిబ్రవరి, మార్చి వరకు ఒక్కోచేప కిలో వరకు ఎదుగుతుంది. జలాశయాల్లో నీరు సమృద్ధిగా ఉంటేనే చేపపిల్లల ఎదుగుదల బాగుంటుంది. అయితే చెరువులు, కుంటలు, జలాశయాల కింద పంటల సాగు ఉండడం వల్ల రోజు పంటల కోసం నీటిని వదులుతారు. దీంతో రోజురోజుకూ నీటినిల్వలు తగ్గుముఖం పడుతాయి. నీటినిల్వలు తగ్గడం మూలంగా చేప ఎదుగుదల నిలిచిపోతుంది. నీటి నిల్వలు తక్కువగా ఉంటే చేపలు చనిపోతాయి. దీంతో మత్స్యకారులు నీటి నిల్వలు తగ్గుతున్నప్పుడే చేపల సైజు పెరగకున్నా వాటిని పట్టేసి విక్రయి స్తారు. జిల్లాలో 702 చెరువులుండగా నీటి విస్తీర్ణం 12,910 హెకార్లు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. 184 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలుండగా వాటిల్లో 15,741 మంది సభ్యులు ఉన్నారు. వీరి జీవ నాధారం చేపల పెంపకమే.

నగదు బదిలీ చేయాలి..

అదును దాటుతుండడంతో చాలా వరకు చెరువుల్లో జిల్లాలోని మత్స్య పారిశ్రామిక సహకార సం ఘాలు(సొసైటీలు) చేపపిల్లల్ని వదిలారు. ఇప్పటికే లక్షలాది రూపాయలను ఖర్చు చేసినందున ప్రభుత్వం స్పందించి మత్స్యకారులకు చేప పిల్లలకు బదులు బదిలీ చేయాలని సొసైటీలు కోరుతున్నాయి. రాబోయే కాలంలో కూడా నగదు బదిలీ చేస్తే, ఆయా ప్రాంత చెరువులు, కుంటలు, జలాశయాల పరిస్థితిని బట్టి చేపపిల్లల్ని వదులుకునే అవకాశం ఉంటుందని మత్స్యకారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో

702	చెరువులు
12,810	హెక్టార్ల నీటి విస్తీర్ణం
184	మత్స్య సొసైటీలు
15,741	సొసైటీ సభ్యులు

రెండు ఏజెన్సీలు ఖరారు

ఇటీవల కురిసిన వర్షాలతో నిండుకుండలా మారాయి. ఇదే మంచి అదును కావడంతో చేప పిల్లలను పోసేందుకు మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. గత ఏడాది చేప పిలలను పంపిణీ చేయడానికి ఐదు ఏజెన్సీలు టెండర్లు దక్కించుకోగా ఈ ఏడాది రెండు ఏజెన్సీలు ముందుకు వచ్చాయి. వచ్చిన రెండింటినీ ఫైనాన్షియల్ బిడ్లను ఓపెన్ చేసి అధికారులు ఖరారు చేశారు. ఒకటి నిజామాబాద్‌కు చెందిన దంతబోయిన సూర్యనారాయణ, రెండో నెక్కొండకు చెందిన సూర్యయ్య టెండర్లను దక్కించుకున్నారు. చిన్న చేపపిల్లకు 65 పైసలు, 80 ఎంఎం నుంచి వంద ఎంఎం సైజ్ చేపపిల్లలకు రూపాయి 74 పైసలకు టెండరు ఖరారు చేశారు. గతంలో 1.93 కోట్ల చేపపిల్లను పంపిణీ చేయగా ప్రస్తుతం అందులో సగమే పంపిణీ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. కాగా, వారం రోజుల్లో జలాశయాల్లో చేపపిల్లలను వదిలేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రారంభించేం దుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రాష్ట్ర స్థాయిలో సీఎం, జిల్లా స్థాయిలో మంత్రి, నియోజక వర్గం స్థాయిలో ఎమెల్యేలు ప్రారంభించిన విషయం తెలిసిందే... ఇప్పుడు కూడా అదే తరహాలో చేస్తారని ఊహాగానాలు వినబడుతున్నాయి.

కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి

జలాశయాల్లో చేపపిల్లల పంపిణీకి గత ప్రభుత్వం 2018లో కాంట్రాక్టు వ్యవస్థను తీసుకువచ్చింది. ఈ వ్యవస్థలో అనేక లోపాలున్నాయని మత్స్య సహకార సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ కాంట్రాక్టర్లకు అప్పజెప్పడం సరైంది కాదని, కాంట్రాక్టర్లు నాసిరకం చేపపిల్లను పంపిణీ చేస్తున్నారని, సైజులోనూ, లెక్కల్లోనూ తప్పిదాలుంటున్నాయని వాపోతున్నారు. ఫలితంగా ఉపాధి దెబ్బతింటోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేప పిల్లల పంపిణీ బాధ్యత సొసైటీలకే అప్పగించాలని కోరుతున్నారు.



చేపపిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలి

నీరటి సదానందం, ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నేరుగా పెట్టుబడి సాయం అందిస్తున్నట్టుగానే మత్స్య పారిశ్రామిక సంఘాలకు అందించాలి. చేపపిల్లల కొనుగోలు కోసం నేరుగా బ్యాంకుల్లో డబ్బులు జమ చేయాలి. దీంతో సంఘాలు సకాలంలో చేపపిల్లను కొనుగోలు చేసి జలాశయాల్లో వదిలేందుకు అవకాశం ఉంటుంది. దాంతో మత్స్యకారులకు లాభం చేకూరుతుంది.

దీన్‌దయాళ్ ఆశయాలను కొనసాగిస్తాం: గంట



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గంట రవికుమార్

శంభునిపేట, సెప్టెంబరు 25 : దేశ సేవనే పరమావధిగా తుదివరకు శ్వాస వరకు దేశం కోసమే పాటుపడిన మహోన్నత వ్యక్తి పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. రంగశాయిపేటలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం దీన్‌దయాళ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రవికుమార్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతూ భారతీయత, ధర్మరాజ్యం, అంత్యోదయ భావనలతో భారతీయ సంస్కృతి పునాదులపై దేశ అభివృద్ధిని నిర్మించాలని పిలుపునిచ్చిన మహనీయుడన్నారు. ఆయన బోధించిన ఏకాత్మ మానవవాదం సిద్ధాంతం ప్రకారం దేశ భద్రతతోపాటు ప్రతీ వ్యక్తికి అభివృద్ధి, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయాన్ని అందించాలని తపన పడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల దీన్‌దయాల్, నాయకులు కర్నె రవీందర్, బక్కి రంజిత్, ఆరె కార్తిక్ దారబోయిన అనిల్, తాళ్లపల్లి అర్జున్, కంది రాజేష్, వేణుగోపాల చారి, కత్తి సోని తదితరులు పాల్గొన్నారు.

యశ్వంత్ ఖాతాలోకి మరో పర్వతశ్రేణి

మరిపెడ, సెప్టెంబర్ 25 : మౌంటెనర్ యశ్వంత్ ఖాతాలోకి మరో పర్వతశ్రేణి చేరింది. మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన భూక్యా రామ్మూర్తి-జ్యోతి దంపతుల చిన్నకుమారుడైన భూక్యా యశ్వంత్ అతి చిన్న వయస్సులోనే ఆయన వయస్సుకు మించి అరచేతిలో ప్రాణాలను అడ్డుపెట్టి భయంకరమైన పర్వతాలను అధిరోహిస్తూ అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌డీసీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న భూక్యా యశ్వంత్ ఇప్పటికే సౌత్‌ఆఫ్రికాలోని కిలిమంజారో, యూరప్‌లోని ఎల్బ్రోస్, కోజియోసిస్, యానం, కాగ్‌చేట్, ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పర్వతాలను అధిరోహించారు. సెప్టెంబరు 4వ తేది నుంచి 18రోజుల పాటు పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడి 22వ తేదిన అరుణాచల్‌ప్రదేశ్‌లోని గోరిచెన్ అత్యంత క్లిష్టమైన పర్వాతాన్ని సైతం జయించారు. ఓ వైపు సడలిపోతున్న రాళ్లు, మరో వైపు ప్రమాదకరమైన మెరైన్‌గ్లేసియర్‌ను తట్టుకొని అవలీలగా గోరిచెన్ శిఖరానికి చేరుకొని త్రివర్ణ పతకాన్ని ఎగిరేశారు. దీంతో ఆయన ఖాతాలోకి మరో పర్వతం చేరింది. ఈ పర్వత శిఖర్నాన్ని ఎక్కెందుకు ఇది వరకు కేవలం ఆర్మీ జవాన్లకే అవకాశం ఉండేది. ప్రఖ్యాత ట్రాన్సెండ్ అడ్వెంచర్ కంపెనీ సహాయ సహకారాలు, పెద్దల దాతృత్వంతో గోరిచెన్ పర్వాతాన్ని జయించిన తొలి సివిలియన్‌గా యశ్వంత్ గుర్తింపు దేశచరిత్రలోనే గుర్తింపు పొందారు. ఈ గుర్తింపు తనకు ఎంతో సంతోషంగా ఉందని యశ్వంత్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పేర్కొన్నారు. యశ్వంత్ పర్వతరోహణపై మరిపెడ మండల ప్రజలు, భూక్యా తండా వాసులు, ఆయనకు ఆర్థికంగా, హార్థికంగా సహకరించిన దాతలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



గోరిచెన్ పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్

సైన్స్ సెంటర్ భూములు.. స్వాహా!

(5వ పేజీ తరువాయి)

కొను గోలు చేసినట్టుగా నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి, ఇతరులకు ద ర్జాగా అమ్మకాలు చేశారని సమాచారం. ఇదే అదనుగా కొందరు ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, ఉద్యోగులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. మొత్తంగా హంటర్ రోడ్డులో సుమారుగా 10ఎకరాలకు పైగా కబ్జా అయినట్లు సమాచారం. ఈ ప్రాంతంలో గజానికి రూ.50వేల నుంచి రూ.1లక్షకు పైగా ధర పలుకుతుంది. ఈ నేపథ్యం లో పదెకరాల స్థలం కబ్జా అయితే దాని విలువ రూ.200కోట్లకు పైగానే ఉంటుందని, ఇంత జరిగినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదనేది చర్చనీయాంశంగా మారింది.

కబ్జాల వెనుక కీలక నేతలు!

సైన్స్ సెంటర్ భూముల అన్యాక్రాంతం వెనుక బడా నేతలున్నారనే చర్చ జరుగుతోంది. అడుగు జాగా కబ్జా అయితేనే అగమాగం చేసే అధికారులు వందల కోట్ల సర్కారు స్థలం కబ్జాకు గురైతే మౌనంగా ఎందుకు ఉంటున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో ఈ భూముల అన్యాక్రాంతంపై లోకాయుక్తాకు ఫిర్యాదులు వెళ్లగా.. సర్వే నిర్వహించి, అక్రమణలో ఉన్నవాటిని స్వాధీనం చేసుకుంటామని అధికారులు లోకాయుక్తాకు హామీ ఇచ్చారు. ఇది జరిగి రెండేళ్లు గడుస్తున్నా ఈ భూముల స్వాహాపై నిగ్గుతేల్చడం లేదన్న చర్చ జరుగుతోంది. ఈ కబ్జాల పర్వం వెనుక గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో పాటు వారి అనుచరులు, తాజా, మాజీ కార్పోరేట ర్ల హస్తం ఉందనే చర్చ జరుగుతోంది. ప్రస్తుత అధికార పార్టీలో ఉన్న మరో నేత కూడా కబ్జా చేసిన భూమిలోనే తిష్ఠ వేశారనే ప్రచారం జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యేలతో పాటు కీలకమైన నేతలు, వారి అనుచరులు అక్రమార్కుల్లో ఉండటంతోనే అధికారులు భూముల సర్వేకు వెనుకాడుతున్నారని, మాజీ ఎమ్మెల్యే అనుచరుడు యంత్రాలతో గుట్టను తవ్వి పక్క సర్వే నెంబర్లతో భారీగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల క్రితం రమేష్ అనే వ్యక్తి సైన్స్ సెంటర్ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తుండగా, హనుమకొండ రెవెన్యూ అధికారులు ఆగమేఘాల మీద వెళ్లి అడ్డుకున్నారు. అదే అధికారులు గత ప్రభుత్వం హయాంలో స్వాహా చేసిన కబ్జాకోరులపై ఎందుకు దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ చొరవ తీసుకుని సర్వే నెంబరు 964, 966లో ఉన్న 49ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించేందుకు వెంటనే టైగర్ హిల్స్(పులి గుట్ట)లో భూ సర్వే నిర్వహించాలని, కోట్లాది రుపాయల విలువ చేసే ప్రభుత్వ భూములకు కబ్జాకోరుల నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహకు వినతి పత్రం అందిస్తున్న వైద్యులు

పల్లె దవాఖాన వైద్యుల వేతనాలు పెంచాలి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: పల్లె దవాఖాన వైద్యుల వేతనాలు పెంచాలని పెంచాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను పల్లె దవాఖాన వైద్యులు కోరారు. ఈ మేరకు మంత్రిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతీ గ్రామంలో జ్వర సర్వే నిర్వహిస్తూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నామని, అవసరమైన వారికి మందులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా డాక్టర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ రవికుమార్, సెక్రటరీ డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ వీరేంద్రనాథ్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ దశరథ్, డాక్టర్ సురేశ్, డాక్టర్ విజయ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఐపై సీపీకి ఫిర్యాదు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: వరంగల్ డివిజన్ పరిధిలోని ఒక స్టేషన్ సీఐపై సీపీ అంబర్ కిషోర్ ఝాకు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇటీవల అధికార పార్టీకి చెందిన ఒక డివిజన్ నేతను స్టేషన్‌కు పిలిపించి అక్రమ కేసు నమోదు చేసిన సీఐ.. తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. డివిజన్‌కు చెందిన ఇద్దరు నేతలకు, అదే డివిజన్‌కు చెందిన మరోనేతకు మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో ఇద్దరు నేతలు నియోజకవర్గంలో హవా కొనసాగిస్తున్న ఒక వ్యక్తితో సీఐకి ఫోన్‌చేయించి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో సీఐ డివిజన్ నేతను స్టేషన్‌కు పిలిచి కేసుపెట్టడంతో పాటు చేయిచేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై మనస్థాపానికి గురైన డివిజన్ నేత.. బుధవారం సీపీని కలిసి సీఐపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై సీపీ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. మొత్తంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు నేతల మెప్పు కోసం ప్రయత్నిస్తూ వివాదాల్లో ఇరుక్కుంటున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపు

వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు జరుగుతాయని, లేదంటే బిల్లులు నిలిపివేస్తామని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కాంట్రాక్టర్లను హెచ్చరించారు. గ్రేటర్ వరంగల్ 28వ డివిజన్ హంటర్‌రోడ్డు ప్రాంతంలో 100ఫీట్ల రోడ్డు వద్ద నిర్మించిన సీసీరోడ్డులో పాటు సాయినగర్ ప్రాంతంలో నిర్మించిన డ్రైనేజీని కమిషనర్‌తో పాటు అధికారులు బుధవారం పరిశీలించారు. కొలతలు వేసి పరిశీలించి అక్కడి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈలు రాజ్‌కుమార్, రంగారావు, కృష్ణమూర్తి, ఏఈలు సతీష్, హరికుమార్, ముజామిల్ పాల్గొన్నారు.



కాంతులీనుతున్న.. కళా సౌధం..

ప్రారంభానికి సిద్ధమవుతున్న కాళోజీ కళాక్షేత్రం

ఉమ్మడి జిల్లా సాంస్కృతిక కళావైభవాన్ని చాటిచెప్పేలా.. హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి మైదానంలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం ప్రారంభానికి సిద్ధమవుతోంది. 2014లో నాటి సీఎం కేసీఆర్ జైపూర్‌లో రాజమహల్ తరహాలోని ఈ రాజసౌధానికి శంకుస్థాపన చేయగా.. రూ.85కోట్లతో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. వచ్చేనెలలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉండబోతోందని అధికారులు ఇప్పటికే తెలిపారు. ఈ నేపథ్యంలో కాళోజీ కళాక్షేత్రాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించడంతో కళాక్షేత్ర భవనం ధగధగమెరిసిపోతోంది. ఇక బుధవారం ఈ కళాక్షేత్రంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ పి.ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినితానాజీ వాకడే పరిశీలించారు. మిగిలిన పనుల వివరాలను నిర్వహణ సంస్థ ప్రతినిధులను ద్వారా తెలుసుకున్న వారు త్వరితగతిన పూర్తిచేయాలని , ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు.

- బాలసముద్రం(హనుమకొండ)

మార్కెట్లో తడిచిన మొక్కజొన్నలు

- ఓపెన్ యార్డులో నీటిలో కొట్టుకుపోయిన ఆరబెట్టిన మక్కలు
- వెయ్యి బస్తాలకుపైగా సరుకు ఆగం ● టార్పాలిన్లు ఇవ్వడంలేదని రైతుల ఆరోపణ



కేసముద్రం మార్కెట్ యార్డులో తడిచిన మొక్కజొన్నలను దగ్గరకు చేరుస్తున్న రైతులు



తడిచిన మొక్కజొన్నలను తీస్తున్న రైతు భూక్య రాంజీ

కేసముద్రం, సెప్టెంబర్ 25 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో బుధవారం ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్న మొక్కజొన్నలు తడిచిపోయాయి. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు 65 మంది రైతులు 2076 బస్తాల్లో 1246 క్వింటాళ్ల మొక్కజొన్నలను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకువచ్చారు. రైతులు తమ చెల్కల వద్ద స్థలం లేకపోవడంతో మార్కెట్‌కు మొక్కజొన్నలను తీసుకువచ్చి ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్నారు. మరికొంత మంది రైతులు తమ సరుకు తేమశాతం అధికంగా ఉండడంతో ఓపెన్ యార్డులో పోసుకున్నారు. మధ్యాహ్నం అకస్మాత్తుగా వర్షం రావడంతో రైతులు తమ సరుకును కుప్పగా పోసుకొని, రక్షించుకునేంత వ్యవధి కూడా లేక సరుకు పూర్తిగా తడిచిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో వరద నీటిలో మొక్కజొన్న కొట్టుకుపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సరుకు ఆరబెట్టుకు వారిలో కొంతమంది ఈ-నామ్ లాట్ తీసుకున్నవారు సైతం ఉన్నారు. వర్షం వస్తున్న సమయంలో మార్కెట్ కార్యాలయంలో టార్పాలిన్లు కావాలని అడిగే లేవని సమాధానం చెప్పారని మండలంలోని పెనుగొండకు చెందిన రైతు శీలం శ్రీధర్‌తోపాటు మరికొంతమంది రైతులు ఆరోపించారు. మార్కెట్లో ఆరబెట్టుకున్న సరుకుకు తాము బాధ్యత వహించబోమని మార్కెట్ అధికారులు ఖరాకండితంగా చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెనుగొండకు చెందిన తుప్పర్తి భద్ర య్య, నర్సింహులగూడెం భూక్య రాంజీ, నారాయణపురం నాంపెల్లి సురేందర్, భూక్య మంగ్యా, గుగులోత్ వెంకన్న, భవానిగడ్డతండా ధరావత్ లచ్చీరాం తదితరులకు చెందిన సుమారు వెయ్యి బస్తాలకుపైగా మొక్కజొన్నలు తడిచిపోయాయి.

నేడు బల్దియాలో ఉచిత వైద్య శిబిరం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి స్వచ్ఛతాహే కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరవుతారని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ విధులు నిర్వర్తించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9701999689 సెల్ నెంబర్‌కు ఫోన్‌చేయాలని డాక్టర్ రాజేశ్ తెలిపారు.

30 నుంచి కేయూ మెస్‌కు దసరా సెలవులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: కాకతీయ యూనివర్సిటీలోని మెస్‌లకు సెప్టెంబరు 30 మధ్యాహ్నం నుంచి దసరా పండువను పురస్కరించుకుని సెలవులను ప్రకటిస్తున్నట్లు వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో దసరా సెలవులు అక్టోబరు 2 నుంచి 14 వరకు ప్రకటించారన్నారు. కాగా, విద్యార్థులకు అక్టోబరు 15 నుంచి మెస్‌లన్నీ యథావిధిగా పునఃప్రారంభం అవుతాయని స్పష్టం చేశారు. అక్టోబరు 15 తర్వాత విద్యార్థులు హాస్టల్స్ అడ్మిషన్లు రెన్యూవల్ చేసుకోవాలని వారికే భోజనం పెడతామని స్పష్టం చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: కాకతీయ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో కాంట్రాక్టుపై 68 అసిస్టెంట్ ప్రొఫెసర్, నాలుగు సీఏఎస్ఆర్ఎంవో పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి కేఎంసీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈనెల 27 నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు కేఎంసీలో ఉదయం 10 నుంచి 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రెయినీ ఎస్సైలకు పోలీసు స్టేషన్‌ల కేటాయింపు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలకు కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్‌లను కేటాయిస్తూ బుధవారం సీపీ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. పల్లె పవన్‌కు కాజీపేట, మామునూరు, బి.హేమలతకు సుబేదారి, వర్ధన్నపేట, బండారి శివకు మిల్స్‌కాలనీ, రఘునాథపల్లి, బి.సుజిత్‌కు ఆత్మకూరు, హనుమకొండ, అనంతగిరి మధుకు జనగామ, ఇంతెజార్‌గంజ్, లింగాల దిలీప్‌కు నర్సంపేట, హసన్‌పర్తి, పి.భాగ్యశ్రీకి స్టేషన్ ఘన్‌పూర్, పరకాల పోలీసుస్టేషన్‌లకు కేటాయించారు. ప్రతీ ఎస్సైకి రెండు స్టేషన్‌లు కేటాయించారు. వీరు ఈనెల 25 నుంచి వచ్చేనెల 10వరకు ఒక స్టేషన్, వచ్చేనెల 10 నుంచి 24వ తేదీ వరకు మరో స్టేషన్‌లో విధులపై శిక్షణ తీసుకోనున్నారు.



కేఎంసీలో జరిగిన ఉత్కర్ష వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు





వేడుకలను ప్రారంభిస్తున్న అధికారులు

ఉత్సాహంగా సాగుతున్న ఉత్కర్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25: కాకతీయ వైద్య కళాశాల విద్యార్థులు ఉత్కర్ష వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. బుధవారం ఐదోరోజు ట్రెడిషనల్ డే నిర్వహించారు. ఇందులో విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రాధారణలో కనిపించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో విశేషంగా ఆకట్టుకున్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. అనంతరం ట్రెడిషనల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి బహుమతులను అందజేశారు. సాయంత్రం విద్యార్థులు దాండిక కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థులు నృత్యాలతో అలరించారు.

తల్లిదండ్రులు తలెత్తుకునేలా అమ్మాయిలు ఎదగాలి..

కేయూలో మహిళ ఇంజనీరింగ్ కళాశాల ఆవిర్భావ వేడుకల్లో డీసీపీ షేక్ సలీమా



యూ బ్లేడ్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ షేక్ సలీమా, ఈసీ మెంబర్లు సురేశ్‌లాల్, నిమ్మ సుదర్శన్ తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: అమ్మాయిలు తమ తల్లిదండ్రులు తలెత్తుకునేలా జీవితంలో ఎదగాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా ఉద్బోధించారు. గురువారం కేయూ సెనెట్ హాల్‌లో వర్సిటీ క్యాంపస్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు అధ్యక్షతన కళాశాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన షేక్ సలీమా మాట్లాడుతూ.. మహిళలందరూ అన్ని రంగాల్లో ముందుడాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించాలని సూచించారు. జీవితంలో కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్బోధించారు. షీటీంలపై అవగాహన ఉండాలని చెప్పారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగమణి మాట్లాడుతూ.. అమ్మాయిలు చదువులతో పాటు వ్యక్తిగత రక్షణ, సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మంచి గుర్తింపు తెచ్చుకుని తమ కిష్టమైన రంగాల్లో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు మాట్లాడుతూ.. ప్రైవేట్ కళాశాలతో పోటీపడి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. అమ్మాయిలు చదువులతో పాటు తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. వర్సిటీ న్యాయకళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యుడు డాక్టర్ నిమ్మ సుదర్శన్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యకు బాగా డిమాండ్ ఉందని చెప్పారు. ఖరీదైన ఇంజనీరింగ్ విద్యను గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మాయిలకు వర్సిటీ క్యాంపస్ కళాశాల అందిస్తోందని వివరించారు. విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుని ఎదగాలని హితవు పలికారు. ఈసీ మెంబర్ డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి మాట్లాడుతూ.. జీవితంలో స్థిరపడేందుకు మంచి అవకాశాలున్నాయని చెప్పారు. ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు మాట్లాడుతూ. వర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో పేద, మధ్యతరగతి యువత చదువుకుని టెక్నాలజీరంగంలో ఎదుగుతున్నారని అన్నారు.

కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.కిరణ్‌కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించగా, అధ్యాపకులు డాక్టర్ వీణ, తూర్పాటి వెంకటేశ్, సురేందర్, సాయి తరుణ్, స్వప్న, వాణిశ్రీ, సాహితీ, యశస్విని, దీప్తి, పీవీ వైష్ణవి, రచన, శ్రీజ, కిషన్, దేవేందర్, వాణి, డాక్టర్ జ్యోత్స్న, అనూష, రమ, జ్యోతి ఏఆర్ ఆర్.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ వీరునాయక్, బోధనేతర సిబ్బంది మల్లేశం, జగన్, యాదగిరి, ఫిరోజ్, హుస్సేన్, చైతన్య, లావణ్య, నాగరాజు, తాజ్‌బాబా, ప్రమీల, మమత, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు చేశారు. అలాగే క్రీడాపోటీల్లోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా అతిథులు యూ బ్లెడ్‌యాప్‌ను ఆవిష్కరించారు. రక్తదాన ప్రాధాన్యతను అందరూ గుర్తించాలని పేర్కొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ లక్ష్మణ్ నాయక్ మృతి

వడ్డెపల్లి, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ సదాశివ కాలనీకి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కునుసూతు లక్ష్మణ్ నాయక్ (57)గుండె పోటుతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మణ్ నాయక్ భౌతికకాయాన్ని పరకాల ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ ధరంసింగ్, ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ యూనియన్ నేత గోవర్ధన్ నాయక్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం రూ.20వేలను ప్రభుత్వ పరంగా కుటుంబ సభ్యులకు అందించారు. 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, ఎస్‌డీఎల్‌సీఈ మాజీ డైరెక్టర్ గుగులోత్ వీరన్న నాయక్ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

మైనర్లపై కేసు నమోదుపై ఆరా

ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ నివేదిక

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: మైనర్లపై కేసు నమోదుపై ప్రభుత్వం ఆరా తీసింది. దీనిపై ఇంటెలిజెన్స్ అధికారులు నివేదికను పంపించారు. బుధవారం పత్రికల్లో మైనర్లపై కేసు నమోదుపై కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై ప్రభుత్వం నివేదికను కోరగా ఇంటెలిజెన్స్ అధికారులు పంపారు. కట్ల రాజు అనే సీఏడీ కానిస్టేబుల్ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ టవర్స్‌లో ఉంటున్నాడు. ఈయనకు కూతురు ఉంది. అదే అపార్ట్‌మెంట్‌లో ఉన్న 8మంది పిల్లలు రాజు కూతురిని దూషిస్తూ కారుపై గీతలు గీశారు. సీసీ ఫుటేజీ ద్వారా పిల్లలు చేసిన పనిని గుర్తించి వారి తల్లిదండ్రులకు చెప్పారు. అయితే కారు రిపేరుకు డబ్బులు చెల్లిస్తామని చెప్పి 10రోజుల వరకు స్పందించలేదు. దీంతో కానిస్టేబుల్ రాజు సుబేదారి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఇన్సూరెన్స్ కంపెనీ కారు డ్యామేజీకి రూ.80వేలు చెల్లించింది. కేసు విచారణలో భాగంగా పిల్లల తల్లిదండ్రులను ఎస్ఐ పిలిపించినందుకు సోషల్ మీడియాలో వైరల్ అయిందని, ఆపై పత్రికల్లో కథనాలు వచ్చాయని నివేదికను ఇంటెలిజెన్స్ అధికారులు పంపించారు.

ఆ 'పెద్ద మనిషి' ఎవరు?

- ఆరా తీస్తున్న నిఘా వర్గాలు
- పోలీసులు మర్యాదలపై సీఎం సీరియస్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పోలీసు మర్యాదలు పొందుతున్న వ్యక్తిపై నిఘా వర్గాలు ఆరా తీసినట్లు సమాచారం. మంగళవారం కార్పొరేషన్‌కు వచ్చిన సదరు వ్యక్తికి ఒక ఏసీపీ, సీఐలు మర్యాదలు చేయడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో సాధారణవ్యక్తిగా ఉన్న ఆ వ్యక్తికి ఇద్దరు గన్‌మెన్‌లు సైతం ఉన్నట్లు సమాచారం. ఆ వ్యక్తి విషయం హాట్ టాపిక్‌గా మారడంతో ముఖ్యమంత్రి దృష్టికి సైతం వెళ్లినట్లు తెలిసింది. దీనిపై సీఎం సీరియస్ అయినట్లు సమాచారం. అతడికి గన్‌మెన్‌లు ఎందుకు ఇచ్చారని పోలీసు అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. అధికార పార్టీ పేరు చెప్పుకుని పార్టీకి నష్టం కలిగే పనులు చేసేవారిని క్షమించకూడదని జిల్లా పార్టీ నేతలకు రేవంత్‌రెడ్డి సూచించినట్లు సమాచారం. సదరు వ్యక్తికి గన్‌మెన్‌లను తొలగించడంతో పాటు పార్టీకి దూరం పెట్టే అవకాశాలున్నట్లు తెలిసింది. మర్యాదలు చేసిన పోలీసు అధికారులపై త్వరలో చర్యలుండే అవకాశం ఉన్నట్లు అధికారిక సమాచారం.

క్యాన్సర్ నిర్మూలనకు సమగ్ర పరిశోధనలు జరగాలి

హైదరాబాద్ హెచ్‌సీయూ ప్రొఫెసర్ గీత కె.వేముగంటి

కేయూలో జంతుశాస్త్రం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న గీత వేముగంటి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఇస్తారి తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 25: క్యాన్సర్ నిర్మూలనకు సమగ్ర పరిశోధనలు జరగాలని హైదరాబాద్ కేంద్రీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగం సీనియర్ ప్రొఫెసర్ గీత కె.వేముగంటి అన్నారు. బుధవారం జంతుశాస్త్ర విభాగంలో రెండురోజుల జాతీయ సదస్సు క్యాంపస్‌లోని జువాలజీ సెమీహాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా గీత కె.వేముగంటి మాట్లాడుతూ.. 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ యానిమల్ సైన్సెస్' అనే అంశం కీలక ప్రసంగం చేశారు. క్యాన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధన అవసరమన్నారు. సాధారణ కణాలు ఉత్పరివర్తనం చెందడంతో క్యాన్సర్ కణాలుగా మారుతాయని పేర్కొన్నారు. క్యాన్సర్ కణాలు శరీరంలో ఇతర విభాగాలకు వ్యాప్తి చెందుతాయని చెప్పారు. క్యాన్సర్ చివరి దశలో ప్రాణ ప్రాయం స్థితి ఏర్పడుతోందని చెప్పారు. క్యాన్సర్ చికిత్సలో వాడే మందుల వలన రోగ నిరోధక శక్తి క్రమంగా తగ్గుతోందని అన్నారు. క్యాన్సర్ మూల కణాలపై సమగ్ర పరిశోధనలు జరగాలని అన్నారు. పరిశోధనలతోనే అనేక రకాల వ్యాధులకు ఔషధాలను కనుగోనేందుకు వీలవుతుందని చెప్పారు.

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. బయోటెక్నాలజీ రంగంలో దేశం ముందుకుపోతోందని అన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రెండురోజుల జాతీయ సదస్సును నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. జువాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ షమిత మాట్లాడుతూ.. రెండు రోజుల జాతీయ సదస్సుల్లో ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు 100మంది వరకు విలువైన పరిశోధన పత్రాలను సమర్పిస్తారని వెల్లడించారు. బెంగళూరు గీతం వర్సిటీతోపాటు ఇతర వర్సిటీ నుంచి అతిథులు హాజరుకానున్నట్లు వివరించారు. సెమినార్ సావనీర్‌ను అతిథులతో కలిసి ప్రొఫెసర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ మామిడాల ఇస్తారీ ఆవిష్కరించారు.



హనుమకొండ బస్టాండ్‌లో పోగొట్టుకున్న బంగారు గొలుసును అందిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

బాలసముద్రం, సెప్టెంబరు 25: హైదరాబాద్ నుంచి భూపాలపల్లికి ప్రయాణం చేస్తున్న ఓ వృద్ధురాలు పోగొట్టుకున్న బంగారు గొలుసును ఆర్టీసీ సిబ్బంది గుర్తించి ఆ వృద్ధురాలికి అందించారు. బుధవారం ఆర్టీసీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఆకుల శంకరమ్మ బుధవారం హైదరాబాద్ నుంచి భూపాలపల్లికి ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణిస్తోంది. హనుమకొండలో దిగిన శంకరమ్మ తన బంగారు గొలుసు ఉన్న పర్సును బస్సులోనే మరిచిపోయింది. పర్సు పోయిందని గమనించిన ఆమె.. అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది నవీన్, ఆర్.శ్రీధర్‌లకు విషయాన్ని తెలిపింది. వెంటనే స్పందించిన వారు శంకరమ్మ ప్రయాణించిన బస్సు హనుమకొండ బస్టాండ్ నుంచి బయటకు వెళ్తుండగా బస్సును నిలిపివేసి అందులో ఉన్న బంగారం, ఇతర వస్తువులు తీసుకొచ్చి శంకరమ్మకు అందించారు. ఈ సందర్భంగా బస్టేషన్ మేనేజర్ సెక్యూరిటీ సిబ్బందిని అభినందించారు.

రియల్ టైమ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి

శంభునిపేట, సెప్టెంబరు 25 : విద్యార్థులు రియల్ టైమ్ ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టాలని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రకాశ్ అన్నారు. బొల్లికుంట వాగ్దేవి కళాశాల ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో రియల్ టైమ్ ప్రాజెక్ట్‌లు ఇంటర్న్‌షిప్‌లపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్‌తో పాటు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ హైదరాబాద్ డిప్యూటీ మేనేజర్ డాక్టర్ జి. సనత్‌కుమార్ చీఫ్ డిజైన్ ఇంజనీర్ కస్తూరి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తిరుపతిరావు, ఐఐఐసీ అసోసియేట్ డీన్ డాక్టర్ చింతకింది రాజు, అడ్మినిస్ట్రేషన్ డీన్ డాక్టర్ శశిధర్, హెచ్‌వోడీలు డాక్టర్ సత్యవతి, తస్వీర్ జహాన్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీతారాం నాయక్

ఆచార్య భద్రూనాయక్ స్ఫూర్తిప్రదాత

మాజీ ఎంపీ సీతారాంనాయక్

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 25: కేయూలో క్లర్క్ స్థాయి నుంచి ఆచార్యుడిగా ఎదిగిన దివంగత ఆచార్య భద్రూనాయక్ దళిత, గిరిజన విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని మాజీ ఎంపీ సీతారాం నాయక్ అన్నారు. భద్రూనాయక్ సంస్మరణ సభ బుధవారం హంటర్‌రోడ్డులోని జానపద విజ్ఞాన పీఠం ప్రాంగణంలో పీఠాధిపతి ప్రొఫెసర్ బాబురావు అధ్యక్షతన నిర్వహించారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, సీతారాం నాయక్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. భద్రూనాయక్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఆచార్య మల్లారెడ్డి మాట్లాడుతూ విద్యే లక్ష్యంగా ముందుకు సాగి ఆచార్యుడిగా ఎదిగిన భద్రూనాయక్ మహోన్నతమైన వ్యక్తన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏదైనా భవనానికి భద్రూనాయక్ పేరు పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, కేయూ ఆచార్యులు వెంకటనారాయణ, కె.విజయబాబు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎన్.సుదర్శన్, సారంగపాణి, ఎర్రగట్టు స్వామి, రవీందర్, వల్లభపట్ల నాగేశ్వర్‌రావు, ఎల్లయ్య, రాజ్‌మహ్మద్, సదాలక్ష్మి, సుధా కర్, రమేష్, యాదవరెడ్డి, శ్రీమంతుల దామోదర్, రవికుమార్, బాసని సురేష్, గంప సతీష్, విజయలక్ష్మి, సునంద, ఆంజనేయులు, అశోక్ పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణకు కృషి చేయాలి : డీఎంహెచ్‌వో



బాధితుడి ఇంటి వద్ద దోమల మందు పిచికారీ చేయిస్తున్న డీఎంహెచ్‌వో

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 25: కీటక జనిత వ్యాధులతో అప్రమత్తంగా ఉంటూ, డెంగీ నివారణకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ కోరారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లో డెంగీ బాధితుడి ఇంటి పరిసరాలను బుధవారం డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఆరోగ్యపరమైన సూచనలు చేసి, బాధితుడి ఇంటి చుట్టూ దోమల మందు పిచికారీ చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించి దోమలు, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులతో రక్షణ పొందాలన్నారు. మున్సిపల్ బయాలజిస్టు మాధవరెడ్డి, ఇన్‌చార్జ్ ఏఎంవో మాడిశెట్టి శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్ విజయేంద్రకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ సదానందం పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

- అండర్ రైల్వేగేట్‌లో తీవ్రమైన సమస్య
- పట్టించుకోని అధికారులు

ఖిలావరంగల్, సెప్టెంబరు 25 : వరంగల్ అండర్ రైల్వేగేట్‌లో పెరిగిన కాలనీలు, జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా సమస్య రోజురోజుకూ పెరుగుతోందని స్థానికులు వాపోతున్నారు. కాలనీల్లో సరిపడా వాటర్ ట్యాంక్‌లు లేకపోవడం, అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. నిత్యం తాగునీటి సరఫరా లేకపోవడంతో మినరల్ వాటర్‌ను కొనుగోలు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలో వాటర్‌ట్యాంక్‌లు పెరకవాడ, కరీమాబాద్, ఉర్సు, రంగశాయిపేట, ఖిలావరంగల్, శివనగర్, పుప్పాలగుట్టల్లో ఉన్నాయి. వీటి పరిధిలో గతంతో పాటు నూతన కాలనీలు ఏర్పడడంతో ప్రజలకు సక్రమంగా తాగునీరందక వర్షాకాలంలోనే ఇబ్బందులు ఏర్పడేలా ఉంది.



శివనగర్‌లోని వాటర్ ట్యాంక్

వరంగల్ నగరంతోపాటు, హనుమకొండ జిల్లాలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకపోగా వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోనే తాగునీటికి కటకట తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఎండుతున్న 'కోట' ప్రజల గొంతులు

ఖిలావరంగల్ కోటకు తాగునీరు సరిగా లేకపోవడంతో ఖిలా వరంగల్ పడమర, మధ్య, తూర్పుకోట ప్రజల గొంతులు ఎండుతున్నాయి. 37, 38 డివిజన్ ఖిలా వరంగల్ పడమరకోట, మధ్యకోట, తూర్పుకోటలలో సుమారు 30వేల మంది జనాభా ఉంది. 40 ఏళ్ల క్రితం మధ్యకోటలోని ఏకశిల గుట్టపై కట్టిన వాటర్‌ట్యాంక్ మాత్రమే ఉంది. దానినుంచి లైన్‌మెన్ ఒక రోజు ఉదయం, సాయంత్రం పడమరకోటకు, మరోరోజు మధ్యకోటకు ఉదయం, సాయంత్రం, తూర్పుకోటలకు ఒకరోజు ఉదయం, సాయంత్రం నల్లా నీటిని విడుదల చేస్తుంటారు. అనుకోని పరిస్థితులలో ధర్మసాగర్ నుంచి నీరు రాకపోయినా, పైపులు పగిలినా, విద్యుత్ అంతరాయం ఏర్పడినా, గాలి, వాన, తదితర అంతరాయం కలిగినప్పుడు 3 నుంచి 5 రోజుల పాటు నీటి సరఫరా బంద్ అవుతోంది.

మరమ్మతులతో నీటి ఎద్దడి

అండర్‌రైల్వేగేట్‌లో అభివృద్ధి పనుల కారణంగా ఏదో ఓ చోట తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. శివనగర్‌వాసులకు వాటర్‌ట్యాంక్ దూరంగా ఉందనే పేరుతో చింతల్ ప్రజలకు, జనాభా ఎక్కువగా ఉందని, ఒకే వాటర్ ట్యాంక్ ఉందనే పేరుతో ఖిలావరంగల్ కోటకు, రోడ్ల అభివృద్ధి, పైపుల మరమ్మతు పనులు, విద్యుత్ అంతరాయం అంటూ కరీమాబాద్, రంగశాయిపేట ప్రజలకు తాగునీటి ఇబ్బందులతో ప్రజలు సతమతమౌతున్నారు. ఇంటి పన్ను, నల్లా పన్నులు ముక్కుపిండి వసూలు చేస్తున్న బల్దియా అధికారులు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు.



మధ్యకోటలో 40 సంవత్సరాల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్

వాటర్‌ట్యాంక్ చుట్టూ ముళ్లపొదలు..

మధ్యకోటలోని వాటర్‌ట్యాంక్‌కు లైన్‌మెన్ పైపులపై నుంచే వెళ్లాల్సి వస్తోంది. ఉదయం చీకటి పడితే ప్రమాదకరంగా ఉంటోంది. ట్యాంక్ చుట్టూ ముళ్లపొదలు ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. లైన్‌మెన్ ప్రతిరోజు ఆన్, ఆఫ్‌తోపాటు ట్యాంక్ నిండిందా లేదా అని చూసేందుకు వెళ్లేందుకు కనీసం దారి లేక ఇబ్బంది పడుతున్నారు.

తూర్పుకోట పైపులను సరిచేయాలి

తూర్పుకోట ముదిరాజ్‌కాలనీలో తాగునీరు సక్రమంగా రావడం లేదు. గతంలో వేసిన పైపులను సరిచేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. దీంతో నల్లాల ద్వారా తాగునీరు చాలా తక్కువగా వస్తాయి. పడమర, మధ్యకోటలకు వచ్చే సమసయంలో ఎక్కడైనా అవాంతరం వస్తే తూర్పుకోటలో 3 నుంచి 5 రోజులకోసారి నీరు వస్తోంది. దీంతో క్యాన్‌వాటర్ కొనుగోలు చేసి నీటిని తాగుతున్నాం.

- నర్రా రాజ్యలక్ష్మి, ఖిలావరంగల్

వృద్ధులను ప్రేమగా చూడాలి : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 25: వయోవృద్ధులను ప్రేమగా ఆదరించాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. అక్టోబరు 1న నిర్వహించే ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవ గోడ పత్రికను బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వయోవృద్ధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన కుటుంబ సభ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

● పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతీ ఇంటివద్ద మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్, గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఉత్సవాల ఏర్పాట్లకు సహకరించాలి

కరీమాబాద్ : ఉర్సుగుట్ట రంగలీలా మైదానంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ప్రభుత్వం తరపున ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారదను దసరా ఉత్సవ కమిటీ కోరింది. బుధవారం కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అం దించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేసి సహకరిస్తామని హామీ ఇచ్చారు. త్వర లోనే అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామ న్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండా వెంకన్నగౌడ్, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, సహాయ కోశాధికారి వెలిదే శివ మూర్తి, ఉపాధ్యక్షులు గోనె రాంప్రసాద్, నాగపూరి రం జిత్‌గౌడ్, పొగాకు సందీప్, దామెరకొండ వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీలు బజ్జూరి వాసు, పూదరి అజయ్, బత్తిని అఖిల్ గౌడ్ తదితరులు పాలొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నగరంలో బీజేపీ సభ్యత్వ నమోదు

ఆటోనగర్, సెప్టెంబరు 25: రాష్ట్రంలో బీజేపీని బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. 21వ డివిజన్‌లోని ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్ పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరిశంకర్, ఉపాధ్యక్షుడు వెంకట్‌గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కే మహేష్, డివిజన్ అధ్యక్షుడు కోమాకుల నాగరాజు, ఎస్ శ్రీనివాస్, భిక్షపతి పాల్గొన్నారు.

● మిల్స్‌కాలనీ: రాష్ట్రంలో బీజేపీ బలోపేతం అవుతోందని ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. బుధవారం 34, 40 డివిజన్లలో పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్, డివిజన్ అధ్యక్షులు వంచనగిరి రాజ్‌కుమార్, ఆకుతోట రాజు, నాయకులు పూదరి అజయ్ గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

డీసీఎం ఓవర్‌లోడ్‌తో లారీలకు నష్టం

ఖిలావరంగల్, సెప్టెంబరు 25: డీసీఎంలలో ఓవర్‌లోడ్‌తో సరుకులను రవాణా చేయడంతో లారీలకు నష్టం జరుగుతోందని జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి వేముల భూపాల్, ఎమ్డీ జాకీర్‌లు అన్నారు. బుధవారం వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో ఆర్టీఏ గంధం లక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ డీసీఎంలలో అధికలోడ్‌తో రవాణా చేయడం ద్వారా లారీలకు కిరాయిలు రావడం లేదని వాపోయారు. కార్యక్రమంలో ఎంవీఐ శోభన్ బాబు, అసోసియేషన్ నాయకులు ఖాజాపాషా, లాల్ అహ్మద్, హసేన్, శివక ుమార్, నాగరాజు, దేవేందర్‌రెడ్డి, సలీమ్ అహ్మద్, అజీర్, శ్రీనివాస్, బాబా పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, సెప్టెంబరు 25: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 29 మంది వాహనదారులకు మంగళవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన 29 మంది వాహనదారులకు రూ.48,200 జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన 9 మందికి రూ.8500 జరిమానా విధించినట్లు తెలిపారు.

సనాతన ధర్మ ద్రోహుల దిష్టిబొమ్మ దహనం

కాశిబుగ్గ, సెప్టెంబరు25: సనాతన ధర్మ ద్రోహుల దిష్టిబొమ్మను బుధవారం కాశిబుగ్గలో రాష్ట్రీయ హిందూ పరిషత్ కార్యకర్తలు దహనం చేశారు. పరిషత్ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఉపయోగించడమే కాకుండా, జంతువుల కొవ్వును వాడటం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. దీనికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర, ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో సనాతన హిందూ ధర్మ బోర్డును ఏర్పాటు చేసి, ఆ బోర్డులో పీఠాధిపతులను, ధార్మిక సంఘాలను భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశారు. దేవాలయాల భూముల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిషత్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల సంతోష్, కె.నాగరాజు, సుభాష్, శ్రీకాంత్, రాజేందర్ రెడ్డి, సుజాత, నరేష్, ఎన్.సతీష్, రాజు, సూర్యనారాయణ, ఎం.సతీష్ పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆర్‌హెచ్‌పీ కార్యకర్తలు

ప్రజలకు ఇబ్బంది లేకుండా చెత్తను తరలించాలి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- బల్దియా షెడ్డు, చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తరలింపు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: చిన్న చిన్న వాహనాల నుంచి సేకరించిన చెత్తను భారీ వాహనాల్లో తరలించే క్రమంలో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని మునిసిపల్ వెహికిల్ షెడ్డు (వాహనాల మరమతు కేంద్రం)ను మేయర్ గుండు సుధారాణితోపాటు ఎమ్మెల్యే పరిశీలించారు. అక్కడ నిలిచిపోయిన వాహనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో సమస్య ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలన్నారు. మరమ్మతుల కోసం వచ్చిన వాహనాలను సాధ్యమైనంత త్వరగా రిపేరు చేసి విధులకు పంపించాలన్నారు.

చెత్తను తరలించే క్రమంలో బాలసముద్రంలో ప్రజలకు ఇబ్బంది ఏర్పడుతోందని ఫిర్యాదులు వచ్చాయని, అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. త్వరలో పోతననగర్‌లో ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ప్రారంభం కానుందని, అక్కడ ప్రారంభమైతే ఇక్కడ కొంత సమస్య తగ్గుముఖం పడుతుందని అన్నారు. సకాలంలో విధులకు హాజరుకాని డ్రైవర్లు, కార్మికుల పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, డీఈ శ్రీనివాస్‌లతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాలసముద్రంలో వెహికిల్ షెడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మేయర్

తెలంగాణ భవన్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 25: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమావేశంలో పాల్గొనడానికి 29వ డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్, కార్యకర్తలు బుధవారం తరలివెళ్లారు. హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ సారథ్యంలో సమావేశానికి హాజరు కావాలని కార్యకర్తలు ప్రత్యేక వాహనంలో బయల్దేరివెళ్లారు. కార్యక్రమంలో సదాంత్, మమునూరు రాజు, కరుణాకర్, మంద చంటి, గొర్రె కుమార్, మహేందర్, అరుణ్, కొడకండ్ల సరిత, మంజుల, జావేద్, కిరణ్, ఎలిషా పాల్గొన్నారు.

ఈఈ రాజయ్యకు ఎస్ఈగా పదోన్నతి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో ఈఈగా పనిచేస్తూ ప్రస్తుతం ఇన్‌చార్జి ఎస్ఈగా విధుల్లో కొనసాగుతున్న కె.రాజయ్యకు పూర్తిస్థాయి ఎస్ఈ (సూపరింటెండింగ్ ఇంజనీర్)గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన బదిలీలలో వరంగల్ బల్దియా ఇంజనీరింగ్ విభాగంలో ఎస్ఈగా పనిచేసిన కృష్ణారావుకు హైదరాబాద్‌కు బదిలీ అయ్యింది. అప్పటినుంచి రాజయ్య ఎస్ఈగా అదనపు బాధ్యతలు చేపట్టారు. కాగా, బుధవారం రాజయ్యతోపాటు రాష్ట్రంలో మరో నలుగురికి ఎస్ఈలుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరి దానకిశోర్ ఆదేశాలు జారీ చేశారు. రాజయ్య గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ హోదాలలో పనిచేస్తూ ఎస్ఈ వరకు చేరుకున్నారు. పదోన్నతి పొందిన రాజయ్యను తన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: చాలా కాలంగా గ్రేటర్ వరంగల్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సింగారాపు బాబురావు డిమాండ్ చేశారు. బుధవారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుల కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. చాలాకాలంగా సిబ్బందికి పీపీ కిట్లు, యూనిఫామ్, ఆప్రాన్, పుష్‌కాట్స్, చీపుర్లు, సబ్బులు, నూనెలు, రక్షణ పరికరాలు మూడేళ్లుగా ప్రభుత్వం ఇవ్వకుండా జాప్యం చేస్తోందని మండిపడ్డారు. దీంతో పారిశుధ్య కార్మికులు పనిచేయలేక పోతున్నారని అన్నారు. వెంటనే కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని, లేదంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బరుపట్ల మహేశ్, జన్ను ప్రకాశ్, జీవన్, రంజీత్, సునిత, శ్యాం, నరేంద్రచారీ, మాధవ్, కిశోర్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 25: వరంగల్ జిల్లా పీఆర్టీయూ టీఎస్ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం హనుమకొండలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి సమక్షంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసింది. జిల్లా అధ్యక్షుడిగా ఈదునూరి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఎండి. అబ్దుల్ గఫార్, అసోసియేట్ అధ్యక్షులుగా కె. రఘు, ఎ. మహేందర్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలుగా పి. అర్పిత, ఉపాధ్యక్షులుగా పి. మల్లయ్య, పి. సుధాకర్‌రెడ్డి, ఎస్. శంకర్‌రావు, కె.కుమారస్వామి, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

దసరా ఉత్సవాలకు స్థలం కేటాయించాలి

కాశిబుగ్గ, సెప్టెంబరు 25: కాశిబుగ్గలో ప్రతి ఏటా జరిగే దసరా ఉత్సవాలకు శాశ్వత స్థలం కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ 19వ డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేష్, సీనియన్ నేత కూచన రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం నగరంలో మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం ఇచ్చినట్టు పేర్కొన్నారు. అలాగే ఈసారి దసరా వేడుకలు వైభవంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని విన్నవించినట్టు తెలిపారు.

బల్దియా జేఏసీ ఎన్నికలు ఏకగ్రీవం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 25: గ్రేటర్ వరంగల్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఎన్నికలు బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికలకు పర్యవేక్షకుడిగా గౌరవ అధ్యక్షుడు బిర్రు శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడు బొట్ల బిక్షపతి మాదిగ, ఏల్పుల ధర్మరాజు యాదవ్ వ్యవహరించారు. గతంలో బల్దియా ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై కృషిచేసిన వారిని ఏకగ్రీవంగా నియమించినట్లు ఎన్నికల పర్యవేక్షకులు వెల్లడించారు. జేఏసీ అధ్యక్షుడిగా బొట్ల రమేష్, ప్రధాన కార్యదర్శిగా భాకం సంతోష్, కోశాధికారిగా కట్కూరి స్వర్ణన్‌రాజు, కార్యదర్శిగా బానోత్ బాలునాయక్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా రాజారపు భాస్కర్‌లను నియమించారు. కొద్దిరోజుల్లో పూర్తిస్థాయి కమిటీ వేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్ల రమేష్, జన్ను ప్రకాశ్, జీవన్, పాశం రవి, సత్యం, దేవేందర్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏబీ బర్ధన్ శత జయంతి వేడుకలు

ఖిలావరంగల్, సెప్టెంబరు 25: అలుపెరగని పోరాటాలు చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి కమ్యూనిస్టు నేత, ఏబీ బర్ధన్ ఆశయాలను యువత కొనసాగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ అన్నారు. బుధవారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో బర్ధన్ శత జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్‌లో చేరి అనేక ఉద్యమాలను చేపట్టారన్నారు. సంఘటిత, అసంఘటితరంగ కార్మికుల కోసం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, గుండె బద్రీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా పధాన కార్యదర్శి ల్యాదళ్ళ శరత్, ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్డీ యాకూబ్, నాయకులు నామోజు వెంకటాద్రి, కలకొట్ల రాజు, నాగవెళ్ళి శంకర్, సిలువేరు రాజేష్, ఇనుగాల శ్వేత, ఇనుపెల్లి వీరస్వామి, సిలువేరు అశోక్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో భవిష్యత్ బీజేపీదే ..

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 25 : తెలంగాణ రాష్ట్రంలో 2028లో అధికారం బీజేపీదేనని, భవిష్యత్తుపై నమ్మకంతో సభ్యత్వాల నమోదుకు భారీ స్పందన వస్తోందని రాష్ట్ర సభ్యత్వ సహ ప్రముఖ్ గోలి మధుసూదన్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌లు అన్నారు. బుధవారం పట్టణంతో పాటు మండలంలోని కట్ర్యాల, కడారిగూడెం గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి, సభ్యత్వ నియోజకవర్గ ప్రముఖ్ మల్లాడి తిరుపతిరెడ్డి, జడ సతీష్, కుందూరు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పెద్దూరి రాజు, పింగిలి సంపత్‌రెడ్డి, నాంపెల్లి కుమార్, రాజేందర్‌రెడ్డి, వడ్డె దేవేందర్, సాంబరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.


కట్ర్యాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ నేతలు

కలెక్టర్ కోసం నిరీక్షణ

'స్వచ్ఛతా హీ సేవ'కు రాకపోవడంతో మహిళల నిరాశ


నెక్కొండ హై స్కూల్‌లో కలెక్టర్ రాక కోసం నిరీక్షిస్తున్న మహిళలు

నెక్కొండ, సెప్టెంబరు 25 : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద ముఖ్యఅతిథిగా పాల్గొంటారని మహిళా సంఘాల సభ్యులు హాజరు కావాలంటూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దాంతో బుదవరం ఉత్సాహంగా పెద్ద సంఖ్యలో మహిళలు రాగా, కలెక్టర్ రాకపోవడంతో నిరుత్సాహంతో వెనుదిరిగారు. ఈ సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం వేడుకలను నెక్కొండ హై స్కూల్‌లో నిర్వహిస్తున్నామని ఈ వేడుకలకు కలెక్టర్ ఉదయం తొమ్మిది గంటలకు హాజరవుతారని మహిళలు ఏడు గంటల వరకే హై స్కూల్‌కు రావాలంటూ సంఘాల సభ్యులు తెలపడంతో దాదాపు ఆరు వందల మంది మహిళలు హాజరయ్యారు. స్కూల్ గ్రౌండ్ శుభ్రపర్చి రంగురంగుల ముగ్గులు వేయడంతోపాటు నెక్కొండ గ్రామ మ్యాప్ కూడా వేశారు. అంత సిద్ధం చేసిన తరువాత ఒక దశలో వర్షం వచ్చే సూచనలు కనిపించడంతో తాము వేసిన ముగ్గులు ఎక్కడ చేదిరిపోతాయో అంటూ మహిళలుఆందోళన చెందడంతో వరుణుడు సైతం కరుణించడంతో నాలుగు చినుకులుపడి వర్షం ఆగిపోయింది. కానీ, కలెక్టర్ మాత్రం రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఐదు గంటలు వేచి ఉన్నప్పటికీ వారి నిరీక్షణ వృధా అయింది. నిర్వాహకులు మహిళలు కూర్చోడానికి నేలపై తాటిపత్రులు కానీ, కుర్చీలుకాని ఏర్పాటు చేయక పోవడంతో ఎక్కడ స్థలం ఉంటే అక్కడా కుర్చోగా, వృద్ధ మహిళలు ఇబ్బందులు పడ్డారు. కలెక్టర్ రాకపోవడంతో వర్షం పడితే తమ శ్రమ నీటిపాలైనా తృప్తిపడేవారమంటూ నిట్టూర్చారు. నెక్కొండకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పర్వతగిరి మండలంలో కార్యక్రమాలకు హాజరైన కలెక్టర్ నెక్కొండకు రాకపోవడంతో తమను మరింత బాధకు గురిచేసిందంటూ నిరాశచెందుతూ మహిళలు వెనుతిరిగారు.

మద్యానికి బానిసై రైతు ఆత్మహత్య


వెంకట్‌రెడ్డి (ఫైల్)

నెక్కొండ, సెప్టెంబరు 25 : మండల కేంద్రానికి చెందిన రైతు చల్లా వెంకట్‌రెడ్డి (45) మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మహేందర్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్ర కారం.. నెక్కొండకు చెందిన వెంకట్‌రెడ్డి కొంతకాలంగా మద్యం సేవిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం కుమార్తె శృతి వివాహంచేశాడు.అప్పులు తీర్చేందుకు రెండెకరాల భూమిని అమ్మినా తీరకపోవడంతో అతిగా మద్యం తాగుతున్నాడు. ఈ నెల 24న మద్యం తాగి వెంకటరెడ్డి ఇంటికి రావడంతో తాగుడు మానాలంటూ భార్య లలిత గొడవ పడింది. ఇంటి నుంచి తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి గడి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడగా, విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నాడు.

పశు వైద్యశాలలపై పట్టింపేదీ?

శిథిలావస్థలో భవనం

భయం గుప్పిట్లో సేవలందిస్తున్న సిబ్బంది

పట్టించుకోని ప్రభుత్వం, ఉన్నతాధికారులు

రాయపర్తి, సెప్టెంబరు 25 : మండలంలోని పశు వైద్య శాలలు శిథిలావస్థకు చేరి దయనీయ స్థితిలో ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతాయో తెలియని భవనా కిందనే అధికారులు బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. దీంతో చేసేదేమి లేక ఆరుబయట సేవలు అందిస్తున్నారు. మండలంలోని 40 గ్రామాలు వాటి శివారు తండాల్లోని గొర్లు, పశువులు, మేకలకు ఎన్నో ఏండ్ల క్రితం నిర్మించిన వైద్యశాలలే దిక్కయ్యాయి. ఓ వైద్యురాలు పెచ్చులు మీద పడతాయని భావించి హెల్మెట్ ధరించడానికి సిద్ధమైందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

దీనస్థితిలో వైద్యశాలలు

మండలంలోని 40 గ్రామాల్లో వ్యవసాయ ఆధారిత కుటుంబాలు దాని అనుబంధ పాడి పరిశ్రమకు మూగజీవాల పెంపకం తోడుగా ఉంది. వాటికి ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు మండలకేంద్రంతో పాటు పెర్కవేడు గ్రామంలోని పశువైద్యశాలను వినియోగించుకుంటున్నారు. పెర్కవేడు క్లస్టర్ పరిధిలో చుట్టూ ప్రక్కల గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ పేరుకే వైద్యశాల తప్ప చినుకు పడితే వర్షం కురుస్తూ నీటిలో తడవాల్సిందే. రికార్డులు తడవకుండా టార్పాలిన్లు కప్పుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రాయపర్తిలో భవనం శిథిలం కావడంతో అంగడిలోని అంగన్‌వాడీ సెంటర్‌ను తాత్కాలికంగా ఉపయోగిస్తున్నారు. కాట్రపెల్లిలో భవనం పాక్షికంగా దెబ్బతినడంతో ఇతర చోటుకు చేరుకుంది. మైలారం పశువైద్య శాలను గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసుకున్నారు.

మండలంలో ఇలా..

మండలంలోని 40 గ్రామాల్లో మూగజీవాలు అధికంగా ఉన్నాయి. 10,526 గోవులు, 9,447 పశువులు, 72,862 గొర్లు, 14,923 మేకలు, 520 పందులు, 147 కుక్కలు ఉన్నాయి. వీటితో పాటు నాటుకోళ్లు కూడా పెంపకంలో ఉన్నాయని అధికారులు చెపుతున్నారు. వీటికి వైద్య సేవలు అందించేందుకు శాశ్వత భవనాలు లేకపోవడంతో శిథిలమైన భవనాలు, అద్దె భవనాల్లో గడపాల్సి వస్తుందని చెపుతున్నారు. ఇప్పటికైనా శాశ్వత భవన నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలని రైతులు, వివిధ పశువుల కాపర్లు కోరుతున్నారు.


పెర్కవేడులో శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల

భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి

బండి కుమార్, గొర్లకాపరుల సంఘం అధ్యక్షుడు



పశువులకు, మూగజీవాలకు వైద్యం అందించేందుకు శాశ్వత పక్కా భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించి పాడి రైతులు, గొర్ల కాపరులకు మూలు జరిగే విధంగా నిర్మాణం చేయాలి.

ఆరు బయటే సేవలందిస్తున్నాం..

డాక్టర్ సుధారాణి, పశువైద్యురాలు పెర్కవేడు



ఆరుబయట కుర్చుని పశువులకు మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తున్నాం. భవనం పూర్తిగా శిథిలం కావడంతో పైకప్పు పెచ్చులు ఊడిపడతాయని భయంతో గడుపుతున్నాం. ఉన్నతాధికారులకు పూర్తి వివరాలు తెలిపాం.

మెడికల్ కళాశాలకు పార్థివ దేహం

- కళాశాల ప్రారంభం తర్వాత అప్పగించిన మొదటి మృతదేహం
- వైద్య, విద్య పరిశోధనలకు ఆదర్శంగా నిలిచిన ఉప్పరపల్లి వాసులు


అయిల్‌రెడ్డి (ఫైల్)


వైద్య కళాశాలకు అయిల్‌రెడ్డి పార్థివ దేహాన్ని అందిస్తున్న కుటుంబ సభ్యులు

చెన్నారావుపేట, సెప్టెంబరు 25: మరణించినంతరం మరొకరికి ఉపయోగపడాలనే లక్ష్యంతో తండ్రి పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు అందించిన ఘటన మండలంలోని ఉప్పరపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఉప్పరపల్లికి చెందిన కొన్‌రెడ్డి అయిల్‌రెడ్డి (85) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. అయిల్‌రెడ్డి కుమారుడు రాం మోహన్‌రెడ్డి, భార్య ఉపేంద్ర, మనవడు, మనవరాలు వైద్య విద్య నిమిత్తం పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు అం దించడానికి ముందుకు వచ్చారు. తెలంగాణ నేత్ర అవయవ శారీర దాతల అసోషియస్స్ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్‌లో పార్థివ దేహాన్ని నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల పిన్సిపాల్ మోహన్‌దాస్, అటానమి విభాగం ప్రొఫెసర్ ప్రేమ్‌కుమార్, సిబ్బందికి అప్పగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ మాట్లాడుతూ ఈ పార్థివదేహంతో వంద శాతం వైద్య విద్యార్థులు వైద్య విద్య నేర్చుకుంటారన్నారు. మొదటిసారిగా కళాశాలకు అయిల్‌రెడ్డి శరీర దాతయని అన్నారు. నేత్ర, శరీర అవయవ దానాలు మానవవాళికి మహాఉపయోగాలన్నారు. నేత్ర అవయవ దానాలు చేయడానికి ముందుకు రావాలన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 8790548706కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్స్ అధ్యక్షుడు కోనేరెడ్డి మల్లారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రాజమౌళి, ఉపాధ్యక్షుడు శంకర్‌రావు. ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, కార్యనిర్వహక సభ్యులు అనంతుల కేదారి, రామచందర్, మనోహర్, వెంకట్‌రెడ్డి, వీరస్వామి, చింతల జయహేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్ డ్యాం మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి


చెక్ డ్యాం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 25 : ఆకేరు వాగు చెక్ డ్యాం తాత్కాలిక మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే నాగరాజు సూచించారు. బుధవారం మండలంలోని ఇల్లంద శివారులోని ఆకేరు వాగు చెక్ డ్యాం తాత్కాలిక మరమ్మతు పనులను పరిశీలించారు. మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి చెక్ డ్యాం కోతకు గురి కాకుండా ఉండాలంటే గండి పడిన చోట భారీ రాళ్లను నింపాలని తద్వారా నీరు నిలిచే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గండిని పూడ్చేందుకు కావాల్సిన వనరులను సమకూర్చుకోవాలని, లారీలను పంపిస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే శాశ్వత పనులకు శంకుస్థాపన చేసి ఆకేరు వాగు చెక్ డ్యాంను పరిరక్షిస్తామని తెలిపారు. వాగు పరిసర ప్రాంతాల్లో ఉన్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ శేఖర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, వెంకన్న పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళల అరెస్టు

కమలాపూర్, సెప్టెంబర్ 25 : మండలంలోని ఉప్పల్ బస్టాండ్ ప్రాంతంలో బుధవారం ఇద్దరు మహిళలు గంజాయిని తరలిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. కమలాపూర్ సీఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పోలీసులు బుధవారం ఉప్పల్ బస్టాండ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు మహిళలను విచారించారు. ఈ క్రమంలో వారి వద్ద రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తరలిస్తున్న మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన మహమ్మద్ శమిమ్ (45), వరంగల్ జిల్లా నర్సంపేట మండలానికి చెందిన మంతోజు స్వరూప (50)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయి విలువ రూ.17, 900 వేల వరకు ఉంటుంది. వారి వద్ద ఉన్న 3 మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వీరభద్ర రావు, సిబ్బంది మోహన్, ఉదయ్‌లు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి: టీజేఎస్


మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్

నర్సంపేట, సెప్టెంబరు 25 : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో పాల్గొని కేసులు, జైలుపాలై ఆర్థికంగా చితికిపోయిన తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, ఉద్యమ సమయంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలకు నెలకు రూ:25వేల వంతున పింఛన్‌ను వెంటనే అందించాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో రాజకీయ ఐక్యకార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి సకల జనుల సమ్మె, మిలియన్‌మార్చ్ వంటి అనేక రూపాలలో తెలంగాణ కోసం ఉద్యమించారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గత బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను పట్టించుకోలేదని అన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర వర్కింగ్ కమిటీ ఏకగ్రీవ తీర్మానం మేరకు అమరుల త్యాగాలను గుర్తించి ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని కోరారు. త్వరలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఉద్యమకారులతో వరంగల్‌లో సదస్సును నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సుకు టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్‌ను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యమకారులు, అమరుల కుటుంబాలకు ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.జావిద్, రాష్ట్ర నాయకులు గుంటిరాంచందర్, బొనగాని రవీందర్, సాంబరాతి మల్లేషం, సోల్తి సాయికుమార్, ఎండి.సంధాని, గుంటి సంజీవ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉద్యమకారుల ధర్నా

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, ఉద్యమ కారులకు నెలనెల అందిస్తామన్న పెన్షన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పంజాల వెంకట్, ప్రధాన కార్యదర్శి మద్దికాయల రాంబాబు, ఉపాధ్యక్షుడు బూపతి లక్ష్మీనారాయణ, తౌటు రమేశ్, మహేందర్, జెరిపోతుల ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవో కృష్ణవేణికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉద్యమకారులు దార్లరమాదేవి, కళ్యాణరాముడు, మచ్చికనర్సయ్యగౌడ్, బైరితిరుపతిరెడ్డి, భాస్కర్, దుగ్గిరాజు, సురేశ్, వాసం సాంబయ్య, దోనాల రవి, సాయికృష్ణారెడ్డి, నూకల కృష్ణమూర్తి, పులిగిల్ల యాదగిరి, చిలుకూరి రాజేందర్, రచ్చరఘు,పెరుమాండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

గీసుగొండ, సెప్టెంబరు 25: మానవసేవే మాధవ సేవని చాటిన మానవతావాది పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ నాయకుడు డాక్టర్ కాశీప్రసాద్ అన్నారు. దీన్ దయాళ్ జయంతిని మరియపురంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించి మాట్లాడుతూ భారతదేశం స్వతంత్ర స్వావలంబన దేశంగా ఎదగాలని ఉద్భోదించిన మహనీయుడు పండిట్ అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జాన్‌విక్రం, నాయకులు కొంగర రవికుమార్, ములక ప్రసాద్, పగడాల రాజ్‌కుమార్, కూతురు రాజు, కందికొండ ప్రదీప్ పాల్గొన్నారు.

పత్తిచేనులో కొండ చిలువ


కొండచిలువను పట్టిన రమేష్

నల్లబెల్లి, సెప్టెంబరు 25: మండల కేంద్రంలోని గుండాల కుమా రస్వామి పత్తి చేనులో బుధవారం కొండ చిలువ లభ్యమైంది. రైతు గుండాల కుమారస్వామి పత్తి చేనులో బుధవారం కూలీలు పని చేస్తుండగా సాయంత్రం కూలీలను తీసుకొచ్చేందుకు తన పత్తి చేను వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో పత్తి చేనులో ఒడ్డుకు అడ్డంగా కొండ చిలువ తారాస పడింది. ఆ కొండ చిలువను చూసి ఒక్క సారిగా అవాక్కయిన గుండాల కుమారస్వామి చుట్టూ ఉన్న రైతు లను కూలీలను పిలిచాడు. అనంతరం పాములు పట్టే రమేష్ కొండ చిలువను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులు వచ్చి కొండ చిలువను పట్టుకుని అడవిలో వదిలేశారు.

ఘనంగా ఫార్మసిస్టు దినోత్సవం

నర్సంపేట, సెప్టెంబరు 25: మండంలోని లక్నెపల్లి శివారులోగల బాలాజీ ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలాజీ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఫార్మాసిస్టుల వల్ల ఆరోగ్యమైన సమాజం నిర్మితమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ శ్యాం మాట్లాడుతూ వారం రోజులుగా కొనసాగుతున్న జాతీయ ఫార్మ కొవిజిలెన్స్ కార్యక్రమం ముగిసిందన్నారు. పదిమంది విద్యార్థులు ఎల్తికేర్ కంపెనీలో అవకాశం పొందారన్నారు. కార్య క్రమంలో ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ రవి, టీపీవో మనీష్‌కుమార్, అధ్యాపకులు వెంకటరమణ, నగేశ్, సతీష్, నాగరాజు, కవిత పాల్గొన్నారు. అలాగే బాలాజీ విద్యాసంస్థల విద్యార్థులకు జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వికసిత భారత్‌పై వ్యాసరచన, స్వచ్చతపై పేయింటింగ్ పోటీలను నిర్వహించినట్లు కళాశాల చైర్మెన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు.

సమయం పాటించాలి

గీసుగొండ, సెప్టెంబరు 25 : విద్యార్థులు చదువులో సమయపాలన, క్రమశిక్షణతోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని సైకియాట్రిస్ట్ డాక్టర్ భరత్‌కుమార్ అన్నారు. టెలీమానస్ కార్యక్రమంలో భాగంగా కొనాయిమాకుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పరీక్షల సమయంలో కలిగే మానసిక ఆందోళన నివారణపై సదస్సును బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్‌రావు, అధ్యాపకులు రమణాకర్, శశిధర్, మహేందర్, వెంకట్‌నారాయణ, ప్రసాద్, శ్రీనివాస్, జ్యోతి, చందన, రమేష్, సురేందర్ పాల్గొన్నారు.

27 నుంచి క్రీడా పోటీల ఎంపికలు

గీసుగొండ, సెప్టెంబరు 25 : ఈనెల 27, 28 తేదీలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో గీసుగొండ, సంగెం మండలాల విద్యార్థులకు క్రీడల పోటీలను గీసుగొండ జెడ్పీ పాఠశాలలో నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం పట్టాభి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పీడీ శ్రీనివాస్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 విభాగాలలో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాపోటీలను నిర్వహించి జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు ఆధార్‌కార్డు, పుట్టినతేదీ సర్టిఫికెట్‌లతో నేరుగా పోటీలకు హాజరు కావచ్చని చెప్పారు.

పూర్వ విద్యార్థికి ఉపాధ్యాయుల విరాళం

చెన్నారావుపేట, సెప్టెంబరు 25 : మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, రచయిత చిలపాక వినయ్‌కుమార్‌కు ఉపాధ్యాయులు విరాళాలను బుధవారం అందించారు. ఇదే పాఠశాలలో చదివిన విద్యార్థి ఇటీవల బతుకమ్మ పాట వీడియో చిత్రీకరణ కోసం ఉపాధ్యాయులంతా కలిసి రూ.5100ను. తెలుగు ఉపాధ్యాయురాలు మమత రూ.5వేలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినయ్ రచయితగా మరింతగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయ, మమత, సునీత, రాగి శశిధర్, సంతోష్ కుమార్, పిన్నింటి బాలాజీ రావు, ఉదయ్‌కుమార్, మాధవి, మొగిలి, రమాదేవి, చింతకింది ఇందిర తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ ఫాంను మూసివేయాలి

- తాగునీటి చెరువును పరిశీలించిన ఐబీ అధికారులు

రాయపర్తి, సెప్టెంబరు 25 : రాయపర్తిలో ఏర్పాటు చేసిన పౌల్ట్రీ ఫాంను మూసి వేయాలని రాయపర్తి గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. అంతకు ముందు ఐబీ డీఈ కిరణ్ కుమార్‌తో కలిసి సత్యనారాయణ పౌల్ట్రీ హచరీస్ నుంచి మంచి నీటి చెరువులోకి వస్తున్న కెమికల్ వాటర్‌ను పరిశీలించారు. దీని వలన గ్రామస్థులు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. డీఈ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లనున్నట్లు స్పష్టంచేశారు.

ప్రజా ఆరోగ్యాలను రక్షించేది పారిశుధ్య కార్మికులే


పారిశుధ్య కార్మికుడి పాదాలను కడుగుతున్న అధికారులు

నెక్కొండ, సెప్టెంబరు 25 : ప్రజల ఆరోగ్యాలు పరిరక్షించే బాధ్యత పారిశుధ్య కార్మికులదేనని, వారిని గౌరవించడం ప్రతీ ఒక్కరి బాధ్యతని జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి అన్నారు. నెక్కొండ హై స్కూల్‌లో బుధవారం జరిగిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మహిళలు, విద్యార్థులచే అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పారిశుధ్య సిబ్బంది శ్రీనివాస్, ప్రమీల పాదాలను శుభ్రపర్చి సన్మానించారు. ఆవరణలో మొక్కలు నాటారు. మహిళలు వేసిన నెక్కొండ గ్రామ మ్యాప్ అధికారులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆరోగ్య శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు చేశారు. పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యతంటూ అధికారులు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అనురాధ, ఎంఈవో రత్నమాల, నోడల్ అధికారి రవికుమార్, ఎంపీవో సునీల్‌రాజు, హెడ్మాస్టర్లు రంగరావు, జాన్‌నాయక్, ఎంపీఎం, శ్రీనివాస్, ఏపీవో జాకోబ్, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు మార్త లావణ్య, వనప్రేమికుడు సమ్మయ్య, మహిళ సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

15 ఎకరాల లోపు రైతులకు రైతు భరోసా అమలు చేయాలి : ఏఐకేఎఫ్

నర్సంపేట, సెప్టెంబరు 25 : పెట్టుబడి సహాయం కోసం 15 ఎకరాల లోపు పంటలను సాగుచేసుకునే రైతుల అకౌంట్లలో రైతు భరోసా డబ్బులను రా ష్ట్ర ప్రభుత్వం వెంటనే జమచేయాలని ఏఐకెఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. రైతాంగ సమస్యలపై అక్టోబర్ 15న రాష్ట్రంలోని అన్ని మండలకేంద్రాల్లో ధర్నా కార్యాక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్య క్రమంలో రైతుసంఘం రాష్ట్ర గౌరవ అద్యక్షుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, చంద్రయ్య, ఇస్మాయిల్, కిషన్, సింగతి మల్లికార్జున్, కొమురయ్య, రవీందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, మారయ్య పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


సారయ్య


రాము

నర్సంపేట టౌన్ / సంగెం, సెప్టెంబరు 25 : నర్సంపేట మండల ఇన్‌చార్జ్ విద్యాశాఖాధికారిగా కొర్ర సారయ్య బుధవారం స్థానిక ఎమ్మార్సీలో బాధ్యతలు స్వీకరించారు. సారయ్య నర్సంపేట బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయులుగా విధు లు నిర్వర్తిస్తున్నారు. అలాగే సంగెం మండల విద్యాశాఖాధికారిగా గుగులోతు రాము బాధ్యతలు స్వీకరించారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఆయన బాధ్యతలను చేపట్టారు. రాము సంగెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాయుడిగా పనిచేస్తుండగా ప్రభుత్వం ఆయనను మండల విద్యాశాఖాధికారిగా నియమించింది.

తెగుళ్లు రాకుండా పంటలను కాపాడుకోవాలి

పర్వతగిరి, సెప్టెంబరు 25: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలకు తెగుళ్లు రాకుండా కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ అన్నారు. బుధవారం మండలంలోని జమాల్‌పురంలో వరి, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం విభిన్నంగా ఉన్నందున రైతులు తగుజాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వి.రాజేష్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులు శ్రద్ధతో చదవాలి

సంగెం, సెప్టెంబరు 25 : ఇంటర్‌లో ప్రవేశించిన వారంతా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, శ్రద్ధగా చదువుకోవాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ చెప్పారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూ నియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థులు, జూనియర్ ఇంటర్ విద్యార్థులకు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థులు సమాజం గర్వించేలా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సంగెం ఎంపీడీవో కాసర్ల రవీం దర్, ప్రిన్సిపాల్ కాక మాధవరావు, అధ్యాపకులు విజయనిర్మల, భిక్షపతి, నాగరాజు, బుచ్చిరెడ్డి, కుమారస్వామి, అనిల్, పవన్‌కుమార్, యాకసాయిలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 25 : నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోషణ మాసం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధి అరుణ్‌జ్యోతి మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలబాలికలు సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. సరైనఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, నేటి కిషోర బాలికలే రేపటి బంగారు భవిష్యత్తుకు పునాదులన్నారు. మహిళల్లో రక్తహీనతను తగ్గించేందుకే ఐసీడీఎస్ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నదన్నారు. అనంతరం విద్యార్థులచే పోషణ ప్రతిజ్ఞచేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అంజలి, సీడీపీవో మధురిమ, ఏసీడీపీవో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.